


# శ్రేయోభిలాషులు

దేవరాజు మహారాజు

ముఖం నిండా కాస్మోటిక్స్ రుద్దుకుని, పెదాలకు ఎర్రటి లిప్‌స్టిక్ వేసుకుని, అందమైన షిఫాన్‌చీర చుట్టుకుని, నాగరికంగా షాపింగ్‌కు వెళ్తున్నట్లుంది- నగరంలో సాయంత్రం. రోడ్లమీద నాగరిక జనం . వాళ్ళ అలంకరణ, వాళ్ళ నవ్వులు, వాళ్ళ మర్యాదలు, వాళ్ళ నటనలలో పులకించిపోతోంది సాయంత్రం. అప్పుడే- మొదటి ఆట సినిమాకు క్యూలో నిలుచుంటున్నారు జనం. డాక్టర్లు క్లినిక్స్‌కు చేరుకుంటున్నారు. ప్లేయింగ్ గ్రౌండ్స్ వదలి ఆటగాళ్ళు ఇళ్ళముఖం పడుతున్నారు. తోపుడుబండిమీద గప్‌చుప్‌లు చుప్ చాప్‌గా అమ్ముడైపోతున్నాయి. సెకండ్ హాండ్ పుస్తకాల రూపంలో ప్రపంచ విజ్ఞానమంతా ఫుట్‌పాత్‌లమీద పరుచుకుని వుంది. గుళ్ళలో అయ్యవార్లు గోచులు సవరించుకుని సిద్ధమౌతున్నారు. బార్లు ఫ్రెష్‌గా కళ్ళు తెరుచుకుంటున్నాయి. దేశంలోని క్షేమాన్ని, క్షామాన్ని వార్తల రూపంలో రేడియో వాంతి చేసుకుంటోంది.

ఇటీవలే కొత్తగా వేసిన యూనివర్సిటీ రోడ్డుమీద వాహనాలు స్పీడుగా స్మూత్‌గా పరిగెడుతున్నాయి. పరిగెడుతున్న ఓ స్కూటరు తార్నాకా సెంటరుకు కొద్ది దూరంలో టక్కున ఆగిపోయింది.

"ఏంటండీ ఏమైంది?"- అడిగింది

వెనక సీట్లో కూర్చున్న స్నేహ.

"యింకా ఏమౌతుంది? పెట్రోలు అయిపోయి వుంటుంది. ఆఫీసునుండి వచ్చేప్పుడు బండి రిజర్వులో వుంది. విద్యానగర్‌లోనే పోయించుకోవాల్సింది. మాటల్లో మరచిపోయ్యాను"- అన్నాడు విప్లవ్. రెండు కాళ్ళూ కిందబెట్టి, స్కూటర్‌ను న్యూట్రల్‌లోకి తీసుకున్నాడు. విప్లవ్ బ్యాంక్ ఉద్యోగి. అభ్యుదయ భావాలుగల యువకుడు. స్నేహ విప్లవ్‌కు సరైన జోడి. కొన్ని కొన్ని విషయాల్లో భర్తతో వాదించి సరదాగా ఏడిపిస్తూ వుంటుంది.


"ఇప్పుడెలాగా? ఫంక్షనుకు అందగలమా?" విప్లవ్ భుజాలమీది నుండి కుడిచెయ్యి సుతారంగా వెనక్కు తీసుకుని స్కూటరు దిగింది.

"పెట్రోలుబంక్ పదడుగుల్లోనే వుంది నడుద్దాం"- అన్నాడు అతను. ఇద్దరూ నడిచారు. తార్‌నాకా పెట్రోలు బంక్‌లో చాలా స్కూటర్లు, ఆటోలు నిలబడి వున్నాయి. చూస్తే చాలా సేపే అయ్యేట్లువుంది. కాని నిలబడక తప్పదు. కొద్దిసేపు నిలబడ్డారు. "మీరు పెట్రోలు పోయించేలోగా నేనెళ్ళి స్వీట్స్ కొంటాను. ఫంక్షనుకు ఉట్టి చేతుల్తో వెళ్తే బావుండదు" - అంది స్నేహ. సరే వెళ్ళమన్నాడు విప్లవ్. పక్కనే వున్న దుకాణాలవైపు వెళ్ళిందామె.

స్కూటర్లు, ఆటోలు కొన్ని వెళ్ళిపోయాయో లేదో మరొ లారి వచ్చి ఆగింది. మిగిలినవాళ్ళు త్వరగా పంపించేయమని గొడవచేశారు. బంక్స్ మీద ఇద్దరే వర్కర్లు ఉన్నారు. ఒకడు పెట్రోలు పోస్తున్నాడు. మరొకడు డబ్బులు వసూలుచేస్తున్నాడు. మరో ఐదు నిముషాల తర్వాత కాని విప్లవ్‌కు పెట్రోలు దొరికింది కాదు. యాభై రూపాయల నోటిచ్చాడు. చిల్లరకోసం బోయ్ కేబిన్‌లోకి రమ్మన్నాడు. బోయ్ వెంట అతను కేబిన్‌లో కెళ్ళాడు. అక్కడా రద్దీగానే వుంది. సరైన చిల్లర దొరికేసరికి మరో ఐదు నిముషాలయ్యింది. కేబిన్‌లోంచి బయటకొచ్చి మరోసారి చిల్లర చూసుకుని స్కూటరు కోసం చూస్తే- లేదు. అటూ ఇటూ చూసాడు. తన భార్య స్నేహ కూడా ఎక్కడా కనిపించలేదు. స్కూటరు స్నేహ తీసిందా? అన్న ఆలోచన వచ్చింది. స్నేహకు స్కూటరు నడపడం మహా సరదా. పట్టుబట్టి స్కూటర్ డ్రైవింగ్ నేర్చుకుంది. .. యింకా ఆలోచనలు కొనసాగకుండా వెనకనుండి స్నేహ వచ్చింది. చేతిలో పెద్ద స్వీట్స్ డబ్బా—

"స్నేహా! మన స్కూటరేదీ?"- అడిగాడు.

"ఇది బావుంది. పెట్రోలు కోసం నిలబడింది మీరు. నేను స్వీట్స్‌కోసం వెళ్ళాను కదా! పెట్రోలు దొరకలేదా?"




విప్లవ్ ముఖంలో రంగులు మారాయి. లోన ఒక రకమైన దిగులు ప్రవేశించింది. "పెట్రోలు కాదు స్నేహా- పెట్రోలు పోయించి ఫ్రెండ్ కలుసుకోవడానికి లోనికెళ్ళొచ్చాను అంటే స్కూటరు లేదు."

స్నేహ ఏడుపుముఖమేసుకుంది. వెళ్ళి వర్కర్స్‌నడిగారు. వాళ్ళు తమకు తెలియదన్నారు. ఎన్నో స్కూటర్లు వస్తున్నాయి, పోతున్నాయి- అందులో ఎవరిది ఎవరు తీసుకు పోతున్నారో ఎలా తెలుస్తుంది? విషయం తెలుసుకుని వర్కర్లు శ్రద్ధగా చుట్టుపక్కలవెదికారు. విప్లవ్, స్నేహ చూడగలిగినంత దూరం చూశారు. నీలిరంగు స్కూటరు గురించి చుట్టుపక్కలవాళ్ళను అడిగారు. నీలిరంగు స్కూటర్లు ఎన్ని లేవు? దాదాపు అరగంటసేపు వెదికి విసిగి పొయ్యారు. ఇద్దరూ ఏడుపు ముఖా లేసుకుని వచ్చి, రోడ్డుమీద నిలబడ్డారు,

వచ్చి పోయే ట్రాఫిక్‌ను చూస్తూ—

సాయంత్రాన్ని 'రేప్' చేయబోతున్నట్టుగా పరుగెడుతున్నాయి లారీలు ఉప్పల్ వైపు. ప్రజాసేవయే మా కర్తవ్యం అన్నట్లు ప్రయాణికుల్ని సికింద్రాబాద్ స్టేషన్‌కు తీసుకుపోతున్నాయి బస్సులు. చేయగలిగేదేదో చడీచప్పుడు లేకుండా చేసుకుపోవా లన్నట్లు నిశ్శబ్దంగా పోతున్నాయి కార్లు. అరవై డెబ్బయి కి. మీ. స్పీడుతో పోలేకపోతే తామసలు వుండెందుకన్నట్లు గాలిలో తేలుతున్నాయి కొన్ని కుర్ర-మోటారు సైకిళ్ళు.

కొద్ది సేపట్లో విప్లవ్ కోలుకున్నాడు. చేయవలసిన పనుల గూర్చి ఆలోచిస్తూ నడుస్తున్నాడు. వెంట స్నేహ నడుస్తోంది, నిశ్శబ్దంగా.

"మనుష్యుల్ని నమ్మకూడదండీ అంటే వినరు మీరు. నా జనం నా జనం అని పడిచస్తారు"– అంది కసిగా.

"ఓహ్ స్నేహా! స్టాపిట్. నీకు తెలీదు. ఇలాంటివి ఎప్పుడో ఓ సారి జరుగుతాయి. అయినంత మాత్రాన మనుషులంతా దొంగలూ, ఖూనీకోర్లూ కాదు. ప్రస్తుతానికి వూరుకో. వాదించే ఓపిక లేదు. దగ్గర్లోనే పోలీస్ స్టేషనుంది రిపోర్టిచ్చి ఆటోలో వెళ్ళి ఫంక్షన్ అటెండవుదాం"– అన్నాడు విప్లవ్.

* * *

సమస్యలు నిన్నటివి కొన్ని. నేడు మొదలు కాబోతున్నవి కొన్ని... రేపు రాబోతున్నవి కొన్ని అన్నింటినీ వంటినిండా అద్దుకుని మార్కెట్లోకి వచ్చిన వార్తాపత్రికలాగా సూర్యుడు ఉదయించాడు. అప్పుడే కళ్ళు తెరిచిన స్నేహ కిటికీలోంచి చొచ్చుకొని వస్తున్న వెలుగు చూసింది. పైనందిన కార్యకలాపాలు జ్ఞాపకానికొచ్చి దిగ్గున లేచి కూర్చుంది. పక్కకు చూసింది. భర్త విప్లవ్ యింకా లేవలేదు. లేచి ముందు గదిలోకి వెళ్ళి తలుపు తీసింది. అంతే– నోట మాట రాలేదు. ఆశ్చర్యం.... ఆనందం. అర నిముషం మెదడు మొద్దుబారింది. తరువాత వెనక్కి తిరిగి గంతులేస్తూ బెడ్‌రూంలోకి పరిగెత్తింది.

"ఏమండీ. . ఏమండోయ్. మన స్కూటరు! వాకిట్లో! వుంది. మన స్కూటరే– ఏవండోయ్! లేవండ్లేవండి."

'స్కూటరు'– మాట వినిపించే సరికి విప్లవ్ గభాలున లేచి కూచున్నాడు. రాత్రి స్నేహితునింట్లో ఫంక్షను అటెండై యింటికొచ్చేసరికి బాగా పొద్దుపోయింది. వెంటనే నిద్రకూడా పట్టలేదు. ఫంక్షన్లో స్నేహితుల మధ్య వున్నట్లే కాని మనసంతా స్కూటరు మీదే వుంది. ఉద్యోగం వచ్చిన కొత్తలో ఎంత కష్టపడి కొన్నాడో, దానిమీద స్నేహతో ఎక్కడెక్కడ తిరిగాడో అన్నీ జ్ఞాపకం రాసాగాయి. ఆలోచిస్తూ వుంటే నిద్ర ఎగిరిపొయ్యింది. తెల్లవారు జామున కాబోలు కొద్దిగా కన్నంటుకుంది. నిద్ర సరిపోలేదు. కాని 'మన

స్కూటరు'- అనే మాట ఎంతో మధురంగా వినిపించి లేవక తప్పలేదు. ఎవరో స్కూటరు తెచ్చి వాకిట్లో పెట్టారన్న విషయం స్నేహ మరోసారి చెప్పింది. విప్లవ్ లేచి వాకిట్లోకి పరిగెత్తాడు. నమ్మశక్యం కానట్లుగా అది తన స్కూటరే. అదే రంగు.. అదే నెంబరు.... అసలు స్కూటరే తనదైతే యింకా ఒక్కొక్కటి చూడాల్సిన పనేమిటి? యింతలో స్కూటరు సీటుమీద మడిచి పెట్టిన తెల్ల కాగితం కనిపించింది. పేపరు ఎగిరిపోకుండా చిన్నరాయి బరువు పెట్టివుంది. ఆత్రంగా విప్లవ్ కాగితం విప్పాడు. అందులో రెండు సినిమా టికెట్లున్నాయి. పొందికగా రాసిన అక్షరాలు కనిపించాయి.

"డియర్ సర్- మీరెవరో మాకు తెలీదు. నిన్న అత్యవసర పరిస్థితులో మిమ్మల్ని అడగకుండా మీ స్కూటరు తీసుకుపోవాల్సివచ్చింది. అది దొంగతనంకింద లెక్క. కాని నిన్న మా పరిస్థితి అలాంటిది. సమయానికి మీ స్కూటరు దొరకడంవల్ల రాత్రి మా పనులన్నీ చకచకా చేసుకోగలిగాం. మేం చేసిన పనికి సిగ్గుపడుతున్నాం. క్షమించమని అడగడానికూడా మాకు అర్హత లేదు. ప్రతిఫలంగా మీకేం సహాయం చేయగలం? కాని ఏదో ఉడతాభక్తి స్కూటరు టాంకునిండా పెట్రోలు పోయించాం. ఇందులో ఈ రోజువి సెకెండ్ షోవి సినిమా టికెట్లు పెడుతున్నాం. శ్రీనివాస థియేటర్లో క్రేజీ బోయ్స్ ఎట్ సూపర్ మార్కెట్ చూడండి. ఈ యింట్లో మిమ్మల్ని చాలా సార్లు చూసాం గనక చిరునామా గురించి వెదికే శ్రమ తప్పింది మాకు. అభినందనలతో__ మీ శ్రేయోభిలాషులు".

ఉత్తరంలో ఒక్కొక్క వాక్యం చదువుతున్నకొద్దీ విప్లవ్ వదనం ప్రసన్నమైపోయింది. సన్నటి నవ్వు. గర్వపుచూపు.... మనుషులు చెడ్డవాళ్ళు కాదన్న తన నమ్మకం నిజమైనట్లు గర్వం. ఆ గర్వంతో కనుబొమలెగరేస్తూ భార్యవైపు చూసాడు. ఆమె ఆశ్చర్యంలోంచి తేరుకుని, భర్త గర్వం చుట్టూ మూతి మూడుసార్లుతిప్పి లోని కెళ్ళిపోయింది. మనుషుల మంచితనంమీద స్నేహకు చిన్న ఉపన్యాసం యివ్వాలనుకున్నాడు. కాని ఎందుకో మానుకున్నాడు రోజుకన్నా ఉత్సాహంగా ఆఫీసుకు తయారయ్యాడు. బాత్‌రూంలో స్నానం చేస్తూ దేశమంటే మట్టికాదోయ్, దేశమంటే మనుషులోయ్ అని గొంతెత్తి పాడాడు. అదే ట్యూన్ ఈలపాటగా పాడాడు. భర్త అవస్థకు స్నేహ లోలోన నవ్వుకుంది. దొరికిందన్న ఆనందంలో తిండికూడా సరిగా తిన్లేదు. హడావుడిగా ఆఫీసుకెళ్తూ సాయంత్రం తయారై వుండమని, సినిమాకు వెళదామని ఒకటికి రెండు సార్లు చెప్పాడు.

రోజుటిలాగే స్నేహ యింటిపని చూసుకుంది. పగలు పత్రికలతో గడిపింది. పోస్టులో వచ్చిన ఉత్తరాలు చదివింది. వీణ ప్రాక్టీసుచేస్తూ కూర్చుంది. కాని ఆఫీసులో విప్లవ్ ఎంతో ఉల్లాసంగా గడిపాడు. పనులన్నీ చాలా శ్రద్ధగా చేసాడు. ఫోన్లో పెద్ద పెద్దవాళ్ళతో ఎంతో వినయంగా మాట్లాడాడు. కిందవాళ్ళను పెద్దతరహాగా మందలించాడు. చూస్తుండగా సాయంత్రమైంది. ఆఫీసునుండి స్కూటరును యింటివైపుకు పరిగెత్తించాడు. స్నేహ అప్పటికే తయారై స్వాగతం పలికింది. "సినిమా టికెట్లు సెకెండ్ షోవి కదా అప్పటివరకు ఏం చేద్దాం?"— అనడిగింది వస్తూనే. "స్కూటరు దొరికిన సందర్భంగా మనం ఈ రోజు ఏమేం చేయాలో అంతా ఆలోచించే పెట్టానోయ్"— అన్న విప్లవ్ మరో అరగంటలో తయారయ్యారు.

"స్కూటరివ్వడమే కాక సినిమా టికెట్లివ్వడమేమిటి? దొంగ వెధవలు. దీని వెనక ఏం ప్లానుందో ఏమోనండీ. టికెట్లు పోతే పోయినయి సినిమా యేం వద్దులెండి. నా మూడ్ కూడా బాగులేదు." అని అనుమానం వెలిబుచ్చింది స్నేహ. విప్లవ్ విసుక్కున్నాడు. "ప్లాను లేదు పాడు లేదు గానీ బయలుదేరు— నీకన్నీ అనుమానాలే. అసలు నాతో బయలుదేరావంటేనే.... నీ మూడ్ దానంతటదే బాగవుతుంది." అంటూ భుజాలెగరేసాడు విప్లవ్. ఇద్దరూ బయలుదేరారు. తలుపులన్నీ వేసి, యింటికి తాళంవేసి స్కూటరుమీద బయలుదేరారు. రోడ్డుమీద జనప్రవాహంలో కలిసి టాంక్ బండ్ చేరుకున్నారు. అరగంట టాంక్ బండ్ మీద, రెండు గంటలు ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో గడిపి అశోకా హోటల్లో భోజనంచేసారు. అప్పటికి రాత్రి తొమ్మిదయ్యింది. ఇక అప్పుడు నిదానంగా థియేటర్‌కు బయలుదేరారు. పోయిందనుకున్న స్కూటరు దొరకడంపోగా, దాని మూలంగా తాము ఇప్పుడు సినిమా చూడబోవడం విచిత్రంగా తోచింది వాళ్ళకు. చాలా సేపు స్కూటరు తిరిగి యిచ్చిన శ్రేయోభిలాషులగూర్చి మాట్లాడుకున్నారు. శ్రేయోభిలాషులమీద జోకు వేసుకున్నారు. సినిమా మొదలయ్యింది. స్నేహ సినిమాలో లీనమైంది. విప్లవ్ మాత్రం ఆ ఇంగ్లీషు సినిమాను తెలుగువాళ్ళు కాపీకొడితే ఎలాచేస్తారో ఊహిస్తున్నాడు. సినిమాలో క్రేజీ బోయిస్ బాగా నవ్వించారు. సినిమా మొత్తం స్నేహ తెరలుతెరలుగా నవ్వుతూనే వుంది.

సినిమా అయిపోయింది. బడలికతో బరువుగా యింటికి బయలుదేరారు. స్కూటర్ డ్రైవ్‌చేస్తూ విప్లవ్ ఇంగ్లీషు పాటలుకూడా పాడాడు. చలిగాలిలో, చిమ్మని చీకటిలో, అవి వింతగా వినిపించాయి స్నేహకు. భర్త ఉత్సాహానికి

లోలోనే నవ్వుకుంది. "ఓయి అల్ప సంతోషిగారూ వాహనం నిదానంగా పోనివ్వండి"___ అని కూడా హెచ్చరించింది.

రోడ్డు మలుపులన్నీ తిరిగి యింటి ముందు స్కూటరు ఆపుకునేసరికి ఇద్దరికీ గుండె ఆగిపొయ్యేనంత పనైంది. యింటి తలుపులు బార్లా తెరిచివున్నాయి. లోన లైట్లన్నీ వెలుగుతున్నాయి. చుట్టూ అర్ధరాత్రి దాటిన నిశ్శబ్దం. ఎక్కడా అలికిడి లేదు. చుట్టుపక్కల యిళ్ళన్నీ నిద్రలో జోగుతున్నాయి. విప్లవ్, స్నేహ ఒకరి ముఖాలొకరు చూసుకున్నారు. ఏం మాట్లాడాలో ఎవరికీ తోచడంలేదు. తెలియని భయంతో బిక్కుబిక్కుమంటూ యిద్దరు ఒక్కొక్క అడుగేస్తూ, తమ యింట్లోకి తామే దొంగల్లా ప్రవేశించారు. లోన ఎవరూలేరు. అంతా కొల్లగొట్టబడి కళావిహీనంగా లైట్ల వెలుగులో గదులు వెలవెలబోతున్నాయి. స్టీల్ అల్మారా కత్తిపోట్లు తిని శవంలా నిలబడివుంది. పది వేలు విలువచేసే బంగారు నగలు లేవు. గోడగడియారం చప్పుడు లేదు. స్టీలు సామాను కనిపించడంలేదు. స్నేహకు ఏడుపు ఆగలేదు. సన్నగా మొదలై తీవ్రస్థాయికి చేరుకుంది. విప్లవ్ బాగా దెబ్బతిన్నాడు. ముఖంలో రక్తంచుక్క లేదు. అతని అభిప్రాయాలన్నీ దోచుకోబడినాయి. విప్లవ్ ముఖం క్వశ్చన్ మార్క్‌లా తయ్యారైంది. ఈ స్వంత ఆసులేమిటి? ఈ దోచుకుపోవడాలేమిటి? ఈ వ్యవస్థ ఇలా ఎందుకుంది? లాంటి ప్రశ్నలు ఇదివరకు ప్రారంభదశలో వుండేవి. విప్లవ్ మెదడ్లో అవి ఇప్పుడు ఎదిగి ఎదిగి పెద్ద సమస్యల్లాగా తయారయినని. స్నేహ విప్లవ్‌ను విసుక్కుని దొంగల్ని, మనుషుల్ని, సమాజాన్ని, కాలాన్ని, తిట్టింది శాయశక్తులా.

డైనింగ్ టేబుల్‌మీద మళ్ళీ ఉత్తరం .... "మా కోర్కె మన్నించి రెండో ఆట సినిమాకు పోయినందుకు కృతజ్ఞతలు. మీ ఋణం తీర్చుకోలేము___" శ్రేయోభిలాషులు"

వెలవెలబోయిన ఆ రాత్రి అతి కష్టం మీద తెలతెలవారింది. సర్వం కోల్పోయిన వాడిలాగా విప్లవ్ ఆఫీసుకెళ్ళాడు. ఏపనీ చేయాలనిపించడంలేదు. ఆ సమయంలో కలీగ్ గోపాల్‌రెడ్డి వచ్చి పలుకరించాడు. "ఏంసార్ అంత డల్‌గా వున్నారూ? మీకో గుడ్‌న్యూస్ చెప్పాలి ...." ప్రశ్నార్థకంగా చూశాడు విప్లవ్. "ఏంలేదూ- నిన్న సాయంత్రం థియేటరులో పార్కుచేస్తే పోయిన నా రాజ్‌దూత్ మోటారు సైకిల్, ఈ ఉదయం ఇంటిముందు పెట్టివెళ్ళారు...."

"సినిమా టికెట్లతో సహా-అవునా?"- అనుమానంగా అడిగాడు విప్లవ్. గోపాల్‌రెడ్డి ఆశ్చర్యంలో మునిగిపొయ్యాడు. "అరె- మీ కెలా తెలుసు సార్? దివ్యదృష్టిగాని వుందేమిటి?" తేరుకుని అడిగాడు. విప్లవ్ వేదాంతిలా నవ్వాడు___ "దేశమంటే మనుషులోయి-" అంటూ.